
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.9 : కనిష్ఠం 24.3
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
సోమవారం 8 జూలై 2024



పంచాయతీలకు నిధుల కొరత





- నిధులు లేక పంచాయతీలలో పరేషాన్
- నిలిచిన ఆర్థిక సంఘం నిధులు
- నిధుల విడుదలలో సర్కారు జాప్యం
- భారంగా మారిన పంచాయతీల నిర్వహణ
- జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు

నిజామాబాద్ అర్బన్, జూలై 7: గ్రామ పంచాయతీలకు నిధులు రాక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, కార్మికులకు వేతనాలు, గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్లకు సంబంధించిన వాయిదాలు, కరెంటు బిల్లులు ఇతరత్రా ఖర్చులు భారంగా మారుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధుల మంజూరులో ఆలస్యం వల్ల గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులు లేక నిర్వహణ కష్టసాధ్యంగా మారుతోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండగా పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు గుది బండలాగా మారుతున్నాయి. మేజర్ గ్రామ పంచాయతీలకు కొంత ఆర్థిక వనరులు ఉన్నప్పటికీ చిన్న గ్రామ పంచాయతీలకు ఎలాంటి ఆర్థిక వనరులు లేక నెలవస్తే ఖర్చులతో కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ట్రాక్టర్లకు సంబంధించిన కిస్తులు చెల్లించే విషయంలో బ్యాంకుల నుంచి గ్రామ పంచాయతీలకు నోటీసులు వస్తున్న పరిస్థితి నెలకొంది. గ్రామాలల్లో పనిచేసే మల్టీపర్పస్ కార్మికులకు వేతనాలు సైతం చెల్లించలేని పరిస్థితుల్లో గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు ఉండగా చిన్న గ్రామ పంచాయతీలు దాదాపు 200 వరకు ఉన్నాయి. ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామంలో ఉన్న జనాభా ప్రాతిపదికన నిధులు విడుదల అవుతాయి. ఒక వ్యక్తికి రూ.858 చొప్పున సంవత్సరానికి గ్రామంలో ఉన్న జనాభాకు అనుగుణంగా నిధులు విడుదల అవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒక వ్యక్తికి రూ.858 చొప్పున విడుదల చేస్తుంది. 15వ ఆర్థిక సంఘానికి సంబంధించిన నిధులు గత మార్చి నుంచి విడుదల కావాల్సి ఉండగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు ఏడాది కాలంగా విడుదల కాలేదు. దీంతో గ్రామాల్లో పాలన కష్టంగా మారుతోంది. పంచాయతీలలో నిర్వహణ భారం రోజురోజుకూ పెరుగుతుండటంతో గ్రామ కార్యదర్శులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

భారంగా ట్రాక్టర్ వాయిదాలు..

గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో చెత్త తరలింపు, మొక్కల పెంపకం తదితర అవసరాల కోసం పంచాయతీకి ఒక ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. బ్యాంకుల ద్వారా రుణం తీసుకొని ట్రాక్టర్లను కొనుగోలు చేయగా ప్రతినెలా వాటికి కట్టాల్సిన వాయిదాలు ఇప్పుడు గ్రామ పంచాయతీలకు భారంగా మారాయి. ఒక్కో గ్రామ పంచాయతీని బట్టి వాయిదాలు రూ.16వేల నుంచి 20వేల వరకు ప్రతినెలా చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా డీజిల్ ఖర్చు పెద్ద గ్రామ పంచాయతీలకు అయితే రూ.15వేల వరకు, చిన్న గ్రామ పంచాయతీలు అయితే రూ.5వేల నుంచి 6వేల వరకు ఉంటుంది. విద్యుత్ బిల్లులు సైతం పెద్ద గ్రామ పంచాయతీలకు లక్ష వరకు, చిన్న గ్రామ పంచాయతీలకు రూ.30వేల వరకు ఉంటుంది. సిబ్బంది వేతనాలు సైతం చిన్న గ్రామ పంచాయతీలకు రూ.20వేల లోపు, పెద్ద గ్రామ పంచాయతీలకు రూ.40వేల వరకు ఉంటున్నాయి. ప్రతి నెలా చిన్న గ్రామ పంచాయతీలకు రూ.80వేల వరకు, పెద్ద గ్రామ పంచాయతీలకు రూ.లక్షా 50వేల వరకు ప్రతినెలా ఖర్చు అవుతుంది. ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులు కొంత వరకే వస్తుండటంతో చిన్న గ్రామ పంచాయతీలకు రూ.15వేల వరకు, పెద్ద గ్రామ పంచాయతీలకు రూ.30వేల వరకు అదనపు భారం పంచాయతీలపై పడుతుంది. వచ్చే నిధులు తక్కువగా ఉండటం ఖర్చులు పెరుగుతుండటంతో పంచాయతీల నిర్వహణ ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రతి చిన్న పనికి అప్పులు తేవడం లేదా కార్యదర్శులు తమ సొంత డబ్బును వినియోగిస్తుండటంతో గ్రామాలలో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రభుత్వానికి నివేదిస్తాం..

: డీపీవో, తరుణ్‌కుమార్

గ్రామ పంచాయతీలకు నిధుల విడుదలలో జాప్యం అవుతోంది. గ్రామ పంచాయతీలలో నిర్వహణ భారం కష్టమవుతోంది. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. అందుబాటులో ఉన్న నిధులతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ కూడా ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని రకాల పనులు చేపడుతున్నాం.

ప్రశ్నార్థకంగా పథకాల నిర్వహణ..

గ్రామ పంచాయతీలలో మౌలిక వసతులు కల్పించేందుకు 15వ ఆర్థిక సంఘంతో పాటు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు జనాభా ప్రాతిపదికన పంచాయతీ ఖాతాల్లో జమ చేసేవారు. కానీ అవి సక్రమంగా రాకపోవడంతో పంచాయతీలలో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గ్రామాల్లో మురికి కాలువల శుభ్రత, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి పథకాల మరమ్మతులు, తదితర కార్యక్రమాల నిర్వహణ నిధుల లేమితో ఇబ్బందికరంగా ఉంటుంది. వర్షాకాలంలో దోమల తీవ్రత పెరిగే అవకాశం ఉండగా కనీసం బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ చేయలేని పరిస్థితుల్లో గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పెద్ద గ్రామ పంచాయతీలో ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేసే సామర్థ్యం ఉన్న చిన్న గ్రామ పంచాయతీలు ఫాగింగ్ యంత్రాలను అద్దెకు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. వాటికి అద్దె చెల్లించడం కూడా ప్రస్తుతం కష్టంగా మారుతోందని కార్యదర్శులు వాపోతున్నారు. మంచినీటి పైప్‌లైన్‌లు లీకేజీలు చేయించే పరిస్థితులు కూడా గ్రామాల్లో లేవంటే నిధుల ఇబ్బంది గ్రామ పంచాయతీలో ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ పంచాయతీల నిర్వహణ కొనసాగుతుండగా నిధులలేమి గ్రామ పంచాయతీలకు శాపంగా మారుతోంది. గ్రామాలల్లో సమస్యలన్నీ ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటున్నాయి. ప్రస్తుతం విషజ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉండగా పారిశుధ్య కార్యక్రమాలు చేసేందుకు కూడా నిధులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.



డీఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ అర్వింద్

హైదరాబాద్‌లో డీఎస్ సంస్మరణ సభ

- హాజరైన ముఖ్య నేతలు

నిజామాబాద్ అర్బన్, జూలై 7: దివంగత నాయకుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ సంస్మరణ సభ ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఆయన తనయుడు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్, జయప్రకాశ్ నారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కేవీపీ రాంచందర్‌రావు, రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ హర్షకుమార్, ఎంపీ రఘునందన్‌రావు, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, మాజీ ఎంపీలు వి.హన్మంత్‌రావు, మధుయాష్కీ, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు వివేక్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర అభివృద్ధిలో, తెలంగాణ ఏర్పాటులో డి.శ్రీనివాస్ చేసిన కృషిని పలువురు కొనియాడారు.

మున్నూరుకాపు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

డి.శ్రీనివాస్ సంస్మరణ సభను ఆదివారం నగరంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ మున్నూరుకాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తోటరాజశేఖర్ ఆధ్వర్యంలో సభను నిర్వహించారు. మున్నూరుకాపుల ఐక్యత కోసం డీఎస్ కృషి చేశారని ఆయన నాయకుడిగా ఎదిగిన క్రమం అందరికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. డీఎస్ లేని లోటును ఎవరు తీర్చలేరని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఘనమైన నివాళులన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు అంజనేయులు, ఆకుల ప్రసాద్, డాక్టర్ అబ్బపూర్ రవి, నారాయణరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు. అలాగే డీఎస్ సంతాపసభను ఆదివారం పట్టణ కుర్మ సంఘం పత్తి వీక్లీమార్కెట్ తర్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుర్మ సంఘం మాజీ కార్యదర్శి మల్లేష్ నాయకులు ప్రసాద్, శ్రీనివాస్, కాంతారావు, భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

డీఎస్‌కు నివాళులర్పించిన అర్బన్ ఎమ్మెల్యే..

పెద్దబజార్: హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ సంస్మరణ సభకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. డీఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



డీఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం ఉద్యోగులు



- సాలూర శివారులోని పాత వంతెన వద్ద వరద ఉధృతి (ఫైల్)
- ఎత్తిపోతల ప్రధాన పంప్‌హౌస్

ప్రతిపాదనలకే పరిమితం!

- కలగానే మంజీరా నదిపై చెక్‌డ్యామ్ నిర్మాణం
- ఏళ్లుగా కార్యరూపం దాల్చని వైనం
- నూతన ప్రభుత్వంపైనే రైతుల ఆశలు

బోధన్‌రూరల్, జూలై 7: సాలూర మండల కేంద్రం శివారులో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల మధ్య ప్రవహిస్తున్న మంజీరా నదిపై చెక్‌డ్యామ్ నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. ప్రభుత్వాలు మారినా.. రైతులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న చెక్‌డ్యామ్ నిర్మాణం మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. ఏటా వర్షాకాలంలో మంజీర నదిలో వరద పోటెత్తి కందకుర్తి గోదావరి నదిలో కలిసిపోతోంది. సాలూర గ్రామ శివారులోని మంజీర నదిపై చెక్‌డ్యామ్ నిర్మాణం జరిగితే సాలూర గ్రామ రైతులతో పాటు నది పొడవునా ఉన్న ఖాజాపూర్, హున్స, మందర్నా గ్రామాల రైతులకు మేలు జరగనుంది. ఆ మూడు గ్రామాలకు ఎలాంటి ప్రాజెక్టులు, చెరువులు లేవు. కరెంటు, బోరు బావులపై ఆధారపడి రైతులు పంట సాగు చేస్తారు. అన్ని రకాల పంటల సాగుకు అనువైన సారవంతమైన 7వేల ఎకరాల నల్ల రేగడి భూములు ఈ ప్రాంతంలో ఉన్నాయి. చెక్‌డ్యామ్ నిర్మాణం అయితే భూగర్భ జలాలు పెరిగి కరెంట్, బోరు బావుల్లో పుష్కలంగా నీరు నిల్వ ఉంటుంది. సుమారు 1600ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్న సాలూర ఎత్తిపోతల పథకానికి జలనిధి సమకూరుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఈ ప్రాంత రైతులు ఆశలు పెట్టుకున్నారు.

సాగునీటి సమస్యకు చెక్‌డ్యామ్

ఉమ్మడి రాష్ట్రంలో చెక్‌డ్యామ్ ప్రతిపాదన పరిశీలన ఉండేది. 2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం మళ్లీ మంజీర నదిపై చెక్‌డ్యామ్ నిర్మాణం ప్రతిపాదన తెరపైకి వచ్చింది. 2015 మార్చిలో అప్పటి సీఎం కేసీఆర్ గోదావరి నది జలాల వివాద అంశంపై అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి పడ్నావిస్‌తో చర్చించేందుకు ముంబాయి వెళ్లారు. ఈ సందర్భంగా బోధన్, బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని రైతులు మంజీర నదిపై చెక్‌డ్యామ్ నిర్మాణం విషయాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. 2016, 2017లో గత ప్రభుత్వం సాలూర శివారులో చెక్‌డ్యామ్ నిర్మాణం కోసం ఇరిగేషన్ శాఖ ద్వారా సర్వే చేయించింది. ఇందుకు రూ.62కోట్ల నిధులు అవసరం ఉంటుందని అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పుకొచ్చారు. ఆ తర్వాత కారణాలు ఏమిటో కాని చెక్‌డ్యామ్ నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది.

సరిహద్దు వివాదమే ప్రధాన సమస్య

తెలంగాణ, మహారాష్ట్రల మధ్య మంజీర నదిలో సరిహద్దు వివాదం ఏళ్లుగా అపరిష్కృతంగానే మిగిలింది. కొన్నేళ్ల నుంచి మహారాష్ట్ర ప్రభుత్వం నదిలోని అక్కడి ప్రాంతంలో ఇసుక క్వారీలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తుంది. కాంట్రాక్టర్లు మన ప్రాంత సరిహద్దులోని నదిలోకి దూసుకువచ్చి భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం జఠిలమయ్యేందుకు కారణమవుతోంది. చెక్‌డ్యామ్ నిర్మాణం జరగాలంటే రెండు రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య సానుకూలమైన విధానపరంగా నిర్ణయం జరగాల్సి ఉంటుంది. జిల్లా, నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సహకారంతో అంతర్రాష్ట్ర సరిహద్దు వివాదంతో పాటు చెక్‌డ్యామ్ నిర్మాణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని రైతన్నలు కోరుతున్నారు.

చెక్‌డ్యామ్ నిర్మించాలని ఏళ్లుగా కోరుతున్నాం..

: కేజీ గంగారాం, సాలూర గ్రామ రైతు

సాలూర శివారులో మంజీరా నదిపై చెక్‌డ్యామ్ నిర్మించాలని ఏళ్లుగా కోరుతున్నాం. ఏటా వర్షాకాలంలో నదిలో వరద పోటెత్తి గోదావరిలో కలుస్తోంది. వర్షాకాలం అనంతరం మంజీరా నదిలో నీళ్లు అడుగంటిపోతాయి. ఎత్తిపోతల పథకం కింద 1600ఎకరాల ఆయకట్టు ఉంది. నదిలో నీళ్లు లేనప్పుడు ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారుతోంది. చెక్‌డ్యామ్ ఉంటే సాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది.

గ్రామదేవతలకు జలాభిషేకం

- వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామస్థుల పూజలు

ముప్కాల్, జూలై 7: ముప్కాల్, బాల్కొండ మండలాల్లో ఆదివారం గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. డప్పువాయిద్యాలు, వలగొడుగులు, మహిళల మంగళహారతులతో ప్రధాన వీధుల నుంచి గంగాజలాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. నైవేద్యాలు సమర్పించి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, కుల సంఘాల సభ్యులు, గ్రామస్థులు, మహిళలు అధిక సఖ్యలో పాల్గొన్నారు.



- ముప్కాల్‌లో గంగాజలాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు



'స్థానిక' ఎన్నికలపై నజర్

- ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే పోటీకి పలువురి ప్రయత్నాలు
- సర్పంచ్, మండల ప్రసిడెంట్, జడ్పీపై నేతల దృష్టి

నిజామాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల పదవీకాలం పూర్తికావడంతో నేతలంతా ఈ ఎన్నికలపై దృష్టిపెట్టారు. ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీలు, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్ ఖాళీ కావడంతో తమకున్న అవకాశాలు, రిజర్వేషన్లను బట్టి పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అధికార కాంగ్రెస్ నేతలతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కూడా ప్రయత్నాల్లో ఉన్నారు. వీరితో పాటు ఇతర పార్టీల నేతలు కూడా స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. గ్రామ, మండలాల్లో కీలకమైన పదవులను పొందేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా లేకుంటే తమ సతీమణులను కూడా దించేందుకు సిద్ధమవుతున్నారు.

ఐదు నెలలుగా గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన

జిల్లాలో గ్రామ పంచాయతీల పాలకవర్గం పూర్తయి ఐదు నెలలు గడిచిపోయింది. గ్రామాల్లో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రభుత్వం కొత్తగా ఏర్పడటం వల్ల పాలకవర్గం పూర్తయ్యే సమయానికి ఎన్నికలను నిర్వహించలేదు. నాలుగు రోజుక్రితం మం డల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్ సభ్యుల పదవికాలం పూర్తయింది. వీటి పరిధిలో కూడా ఎన్నికలను నిర్వహించలేదు. కేంద్ర ప్రభు త్వం నిబంధనలు, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఆరు నెలల్లోపు పాలకవర్గం పూర్తయిన తర్వాత ఎన్నికలను నిర్వహించాలి. కేంద్రం నుంచి నిధులు రావాలంటే గ్రామాల్లో, మండలాల్లో ఎన్నికైన పాలకవర్గాలు ఉండాలి. ప్రభుత్వం ప్రస్తుతం వాయిదా వేసిన త్వరలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో గ్రామాల్లో పోటీకి నేతలు పెరుగుతున్నారు. జిల్లాలో మొత్తం 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు మైనర్ గ్రామ పంచాయతీలు, తండా పంచాయతీలు ఉన్నాయి. ఎన్నికల ద్వారా 530 సర్పంచులు ఎన్నిక కానున్నారు. పార్టీ రహితంగా సర్పంచుల ఎన్నికలు జరిగిన ఆయా పార్టీలు బలపర్చిన వారు కొన్నేళ్లుగా గ్రామాల్లో గెలుస్తున్నారు. గ్రామ స్థాయిని బట్టి పది నుంచి 16 మంది వరకు వార్డు సభ్యులు కూడా ఉన్నారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల సమయంలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా వీరు ఎన్నికవుతున్నారు. వీరితో పాటు మండల స్థాయిలో ఎంపీటీసీలు, జిల్లా స్థాయిలో జడ్పీటీసీలు ఖాళీ అయ్యాయి. మండల స్థాయిలో ఎంపికవుతున్న ఎంపీటీసీలకు గౌరవం ఉంటున్నా నిధుల వినియోగం లేదు. ఎంపీపీగా ఎన్నికయ్యే అవకాశం ఉండటంతో ఎక్కువ మంది పోటీచేస్తున్నారు. రిజర్వేషన్‌కు అనుగుణంగా మండల అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా ఎన్నికవుతున్నారు. జడ్పీటీసీలు కూడా మండలానికి ఒకటి ఉండటం, జడ్పీ చైర్మన్‌గా రిజర్వేషన్‌లను బట్టి ఎన్నికయ్యే అవకాశం ఉండటంతో పోటీ పడుతున్నారు. జడ్పీచైర్మన్‌కు క్యాబినెట్ స్థాయి హోదా ఉండటం వల్ల దీనిపై ఎక్కువ మంది నేతలు దృష్టి పెడుతున్నారు.



ప్రమాదం అంచున ప్రయాణం

- కల్వర్టు రక్షణ గోడలు ధ్వంసం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు


పొతంగల్ చెక్‌పోస్టు వద్ద రక్షణ గోడలు లేని కల్వర్టు


పొతంగల్ చెరువు సమీపంలో కూలిపోయిన రక్షణ గోడలు

కోటగిరి,జులై7: మండల కేంద్రాలను కలిపే ప్రధాన రహదారులతో పాటు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో కల్వర్టు ప్రదేశాలు వాహనదారులకు కలవరపాటుకు గురి చేస్తున్నాయి. అసలే ఇరుకుగా ఉన్న ప్రదేశాలు ఆపై కల్వర్టుల రక్షణ గోడలు ధ్వంసమవ్వడంతో అక్కడ బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటు రహదారులు, భవనాల శాఖ రహదారుల్లోనూ, ఇటు పంచాయతీ రాజ్ రోడ్లను ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవల మండల పరిషత్ పాలకవర్గ సభ్యులు గత ఐదేళ్లుగా ఈ సమస్యలపై సంబంధిత శాఖ అధికారులను ఫిర్యాదు చేసిన, విజ్ఞప్తి చేసిన పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా తమ పరిధిలోకి రాదంటే తమ పరిధిలోకి రాదంటూ అధికారులు చేతులెత్తేయడం గమనార్హం. కోటగిరి ఉమ్మడి మండలంలోని పలు రహదారులపై ఉన్న కల్వర్టులు అధ్వానంగా తయారయ్యాయి. కోటగిరి, రుద్రూర్ ప్రధాన రహదారిపై బండి వాగు, దర్గా వాగు, మల్కాపూర్ గడి వద్ద రహదారికి ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో తరుచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఏడాది క్రితం మల్కాపూర్ గడి సమీపంలో ద్విచక్ర వాహనదారుడు రక్షణ గోడ లేకపోవడంతో కాలువలో పడి మృతి చెందాడు. పొతంగల్ మండలంలోని పొతంగల్ చెక్‌పోస్టు వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. నిజాంసాగర్ కాలువపై ఉన్న కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో తరుచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బీర్కూర్ వెళ్లే వాహనాలు ఈ ప్రాంతం వద్ద అజాగ్రత్తగా నడిపితే పెద్ద ఎత్తున ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. పొతంగల్ చెరువు సమీపంలోనూ, బారపుల్ కల్వర్టు వద్ద సైతం పరిస్థితి ఇలాగే ఉంది. వర్షాలు కురుస్తుండడంతో కల్వర్టుల వద్ద మొక్కలు పెరిగి కనపడే పరిస్థితి లేకుండాపోయింది. ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు తిరిగే రోడ్లలలో ప్రమాదకరంగా మారిన ప్రదేశాలపై సంబంధిత అధికారులు ఉదాసీదాగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పొతంగల్ మండలంలోని సోంపూర్, టాక్లీ మధ్యగల కల్వర్టు ప్రమాదంగా మారింది. కోతకు గురవ్వడంతో ఇక్కడ ప్రయాణం చేయడం ప్రమాదకరంగా మారింది. కల్వర్టులను పూర్తిస్థాయిలో విస్తకరించి ఆధునీకరించాల్సి ఉన్న అధికారులు పట్టించుకోకపోవడం వారి పనితీరుకు నిదర్శంగా మారింది. మండల పరిషత్ సమావేశాల్లో వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్ ఈ విషయపై ఆర్ అండ్ బీ అధికారులను ప్రతి సమావేశంలో ప్రశ్నిస్తున్న తమకేమీ పట్టింపు లేనట్లుగా వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. వాహనదారులు అజాగ్రత్తగా నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కనీసం అధికారులు కల్వర్టుల వద్ద ప్రమాద సూచికలు అయిన ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ఇబ్బందులు పడుతున్నాం

రక్షణ గోడలు లేక శిథిలావస్థలో ఉన్న రహదారులపై రాత్రి సమయంలో వెళ్లేప్పుడు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయమేస్తుంది. కనీసం ప్రమాద సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు రక్షణ గోడలు నిర్మించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

- యూసుఫ్, పొతంగల్

నేడు డిచ్‌పల్లి ఠాణాలో న్యూ క్రిమినల్ లాపై అవగాహన

● హాజరుకానున్న సీపీ, ఢిల్లీ నుంచి న్యాయశాస్త్ర ప్రొఫెసర్‌లు


కొత్తగా నాటిన మొక్కలు

డిచ్‌పల్లి,జులై 7:కేంద్ర ప్రభుత్వం నూ తన చట్టాలను అమలులోకి తీసుకొచ్చిన నేపథ్యంలో ఆ చట్టాల పని తీరు స్వయం గా పరిశీలించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఢిల్లీ నుంచి పోలీస్ శాఖ, న్యాయ శాఖ నిపుణుల కమిటీల బృందం డిచ్‌పల్లి ఠాణాలో అవగాహన సదస్సు నేడు నిర్వహించనున్నారు. డిచ్‌పల్లి ఎస్సైమహేశ్ ఆధ్వర్యంలో పోలీసులు ఠాణాను సర్వంగా సుందరంగా ముస్తా బు చేశారు. నూతన మొక్కలు నాటా రు.పిచ్చి మొక్కలు తొలగించారు. అం తే గాకుండా వాటి స్థలంలో నూతన మొక్కలు నాటారు. శిథలావస్థకు చెందిన పాత బోర్డులను తొగించి నూతన బోర్డులు ఏర్పాటు చేశారు. ఠాణా చుట్టూ స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి పోలీస్ సిబ్బంది ఠాణాలో ఈ పను లు చేయడానికి ముమ్మర కసరత్తు చేశారు. మూలన పడినబైకులు సరి చేసి పెట్టారు. జిల్లాలోనే క్రిమినల్ లా చట్టాలపై అవగహన కల్గిం చేం దుకు డిచ్‌పల్లి ఠాణా ను మొద టగా ఎంపిక చేయడం గమనించదగ్గ విషయం.

కెనాల్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదళ్లు

● బలహీనపడుతున్న కట్ట ● వర్షాకాలంలో కట్టతెగే ప్రమాదం ● పట్టించుకోని అధికారులు


కెనాల్‌కు గండిపడిన దృశ్యం(ఫైల్)


కెనాల్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు

ఆర్మూర్‌టౌన్ , జూలై7: ఆర్మూర్ శివారులోని టీచర్స్‌కాలనీ, జర్నలిసు కాలనీ, రంగచారినగర్, ఒడ్డెరకాలనీ వరకు నిజాంసాగర్‌కెనాల్‌లో పిచ్చిమొక్కలు, ముళ్ళపొదలు ఏపుగా పెరిగిపోయాయి. రాబోయే వర్షాకాలంలో వరద నీటితో కెనాల్‌లో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఏప్రిల్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం యాసంగి పంటను దృష్టిలో ఉంచుకొని గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు, కుంటలు నింపడానికి నీటిని వదలగా జర్నలిస్టు కాలనీలో అర్ధరాత్రి నిజాంసాగర్ కెనాల్‌కు గండి పడడంతో లోతట్టు ప్రాంతంలో నివాసమున్న వారి ఇళ్ళ నీరు చేరింది. దీంతో నిత్యవసర సరుకులు సైతం నష్టపోయారు. విద్యుత్ స్తంభం పడిపోయింది. కాలనీవాసులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఏలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. కానీ ఇప్పటి వరకు నిజాంసాగర్ కెనాల్‌లో పెరిగిన పిచ్చిమొక్కలను, ముళ్ళపొదలను తీయకపోవడంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న ఇప్పటి వరకు ఇరిగేషన్ అధికారులు కెనాల్‌లో పెరుకుపోయిన చెత్త, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ళపొదలను తొలగించకుండా చోద్యం చూస్తున్నారు. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిజాంసాగర్ కెనాల్‌ను శుభ్రపర్చాలని పలు కాలనీవాసులు కోరుతున్నారు.


కాలనీలో నీరు చేరిన దృశ్యం (ఫైల్)

తక్షణమే జిల్లా అధికారులు చొరవ చూపాలి

నిజాంసాగర్ కెనాల్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించడానికి జిల్లా అధికారులు చొరవ చూపి కొన్నేళ్లుగా ఉన్న సమస్యను పరిష్కరించాలి.

- తిరుపతి, ఆర్మూర్







ఫత్తేపూర్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆర్మూర్‌రూరల్, జూలై7: ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యాసంవత్సరం పదవ తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 28ఏళ్ళ క్రితం చదువుకున్న అనాటి విద్యార్థులు ఒక్కచోట చేరి ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాటి తిపిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులు మల్కన్న, రమణరెడ్డి, నర్సయ్య, లింగుసా, రాజ్‌కుమార్‌లను పూర్వవిద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీనివాస్, తట్లపల్లి గణేష్, సాయిరెడ్డి, నగేష్‌రెడ్డి, వేణు, గంగరాజం, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

పేదింటి ఆడ పిల్లల వివాహాలకు ప్రభుత్వ సహాయం : జుక్కల్ ఎమ్మెల్యే


లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

మద్నూర్, జూలై 7: పేదింటి ఆడ పిల్లల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పేరిట ఆర్థికసాయం అందజేస్తున్నట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. ఆదివారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ 42మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన ఆరు హామీలను అమలు చేసినట్లు గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతో సౌకర్యవంత మైందని అన్నారు. జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తనపై ఉందని, రాబోయే ఐదేళ్లలో జుక్కల్ నియోజకవర్గం రూపురేఖలు మారుస్తానని, గ్రామ గ్రామాన సీసీ రోడ్లు, ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. కార్యక్రమంలో మద్నూర్ తహసీల్దార్ ముజీబ్, డోంగ్లి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బసవరాజ్ పటేల్, మద్నూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరస్ సాయిలు, డోంగ్లీ మాజీ ఎంపీటీసీ ధీన్ దయాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై కేజ్‌వీల్స్ నడిపితే చర్యలు తప్పవు: ఎస్సై

భిక్కనూరు, జూలై 7: వరిసాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో ట్రాక్టర్ డ్రైవర్లు రోడ్లపై కేజీవీల్స్ నడపవద్దని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ హెచ్చరించారు. ఆదివారం ఎస్సై మాట్లాడుతూ కేజీవీల్స్ రోడ్లపై నడిపి రోడ్లను ధ్వంసం చేస్తే సహించేది లేదని, కేజీవీల్స్ రోడ్లపై ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా నడిపితే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. రైతులు సైతం తమతో సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

హోంశాఖ సహాయ మంత్రిని కలిసి బీజేపీ నాయకులు

బోధన్‌రూరల్,జులై7: హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీని ఆదివారం బోధన్ బీజేపీ నాయకులు కరీంనగర్ క్యాంప్ ఆఫీస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా బోధన్‌లోని రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అడ్లూరిశ్రీనివాస్,అశోక్‌గౌడ్‌లతో తదితరులున్నారు.



కేంద్ర సహాయ మంత్రిని కలిసిన దృశ్యం

బోధన్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బోధన్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బోధన్‌రూరల్,జులై7: బోధన్ పట్టణంలోని వంశీ హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు 2000-2001 ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి పూర్వ విద్యార్థులు 23సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. 10వ తరగతిలో చదువుకున్న విద్యార్థులు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు, కొన్ని ప్రైవేట్ సంస్థల్లో, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. 23సంవత్సరాల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడం చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. వంశీ హైస్కూల్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, పద్మజ, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పదవ తరగతిలో చదువు చెప్పిన రాంప్రసాద్ గురువుకు పూర్వ విద్యార్థులు 101000రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం

పెర్కిట్, జూలై7: పట్టణంలోని హౌసింగ్ బోర్డులోని పార్కులో హ్యాపీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా వన మహోత్సవం కార్యక్రమంనిర్వహించారు. ప్రతీ ఒక్కరు బాధ్యతగా తమవంతుగా కనీసం రెండు చెట్లు అయిన నాటలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్ పాల్గొని పాఠశాల విద్యార్థులతో,పార్కుకు వచ్చేవా కర్స్ అందరితో కలిసి మొక్కలు నాటారు. అదే విధంగా పార్కుకు పక్కనే ఉన్న ఓపెన్ జీమ్‌లోని వ్యాయామ పరికరాలను రెండు రోజుల్లోగా బాగు చేయిస్తానని అన్నారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ రాజుకు ఫోన్ చేసి రెండు రోజుల్లోగా ఓపెన్ జీమ్‌లోని వ్యాయమ పరికరాలు బాగు చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో స్థానిక కౌన్సిలర్ వరలక్ష్మీ లింబాద్రిగౌడ్, పోలసుధాకర్, పూజ నరేం దర్, టీచర్ మనోహర్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం

జక్రాన్‌పల్లిలో కొనసాగుతున్న వన మహోత్సవం



మొక్కలను పంపిణీ చేస్తున్న బ్రాహ్మణ్‌పల్లి ప్రత్యేక అధికారి

జక్రాన్‌పల్లి, జూలై7: మండలంలోని అన్ని గ్రామాల్లో వన మహోత్సవ కార్యక్రమం కొనసాగుతుంది. ఆదివారం మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో భాగంగా వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను గ్రామప్రత్యేక అధికారి బ్రహ్మానందం పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటికి వెళ్ళి మొక్కలను అందజేశారు. ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, అంగన్‌వాడి టీచర్‌లు, అంగన్‌వాడి టీచర్‌లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పోచారం మాజీ ఎంపీటీసీకి ఘన సన్మానం

ఎడపల్లి,జూలై7:మండలంలోని పోచారం గ్రామ మాజీ ఎంపీటీసి బద్దోల పద్మ, ముత్తన్న దంపతులను ఆదివారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీగా పదవీ కాలం ముగియడంతో గ్రామస్థులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీటీసీగా పదవీ కాలంలో వ్యక్తిగత లాభాపేక్ష లేకుండా గ్రామ అభివృద్ధికి వారు ఎంతో పాటు పడ్డారని, గ్రామ సమస్యల పరిష్కారంలో ముందున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు అశోక్, ఇస్త్రారీ, కోల సాయిలు, కమ్మరి రవి, కట్ట సుదాకర్, సంతోష్, శివ తదితరులు ఉన్నారు.

అంకాపూర్‌లో ఎంపీటీసీలకు సన్మానం

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఆదివారం ఇటీవల పదవికాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంపీటీసీలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మాజీఎంపీటీసీలు ఎంసీ.గంగారెడ్డి, మహేందర్, మాజీమండల కోఆప్షన్‌సభ్యుడు సయ్యద్ ముక్తార్‌లను గ్రామస్థులు సన్మానించారు. ఐదేళ్ల కాలంలో గ్రామాభివృద్ధికి తమవంతు కృషి చేశామని, తమకు సహకరించిన గ్రామస్థులకు, గ్రామస్థాయి అధికారులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

పడకల్ గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



గ్రంథాలయానికి పుస్తకాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

జక్రాన్‌పల్లి, జూలై7: మండలంలోని పడకల్ గ్రామంలో గ్రంథాలయానికి పుస్తకాలను ఉపాధ్యాయులు అంకం నరేష్, శ్రీనివాస్ ప్రోత్సహంతో వేల్పూర్ మండలం వాడి గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు నర్సయ్య పుస్తకాలను వితరణ చేశారు. ఆదివారం పడకల్ గ్రంథాలయానికి రూ.5వేల విలువ గల పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోక పురుషోత్తం, వై.గణేష్ గంగారెడ్డి, పోశెట్టి, బాలగౌడ్, సుధాకర్, రవీందర్, వినిత్, అంకం నరేష్ అకాష్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలివెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు

కోటగిరి,జులై7: ఎమ్మార్పీఎస్ రజతోత్సవను పురస్కరించుకుని కోటగిరి మండలం నుండి ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున హైదరాబాద్ తరలివెళ్లారు.ఈ కార్యక్రమంలో దేగాం సాయిలు, సాయన్న, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోపు సాయిలు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ ఉన్నారు.



తరలివెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హౌసింగ్ బోర్డులో డ్రైనేజీ బాగు చేయరా..?

● గత కొన్నేళ్లుగా కచ్చ డ్రైనేజీ ● పట్టించుకోని పాలక వర్గం ● ఇబ్బందుల్లో కాలనీవాసులు



హౌసింగ్‌బోర్డులో కచ్చడ్రైనేజీ



హౌసింగ్‌బోర్డులో గుంతలు పడ్డ రోడ్డు

ఆర్మూర్‌రూరల్, జూలై7: ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో గత కొన్నేళ్లుగా డ్రైనేజీ వ్యవస్థ అస్త వ్య స్తంగా ఉండడంతో ప్రజలకు అసౌకర్యంగా మా రింది. స్థానిక క్షత్రీయ కళ్యాణ మండపం సమీపంలో డ్రైనేజీ నిర్మించకపోవడంతో కచ్చడ్రైనేజీ ద్వారా మురికి నీరు వెళ్తున్నాయి. దీంతో పందుల బెడద ఎక్కువగా మా రింది. ఆర్మూర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సి పాలిటీ స్థాయికి మారినప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉంది. గత కొన్నేళ్లుగా వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ హౌజింగ్‌బోర్డును అభివృద్ధి చేయడంలో నిర లక్ష్యం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నా యి. డ్రైనేజీ నిర్మాణంతో పాటు కాలనీలో ప్రధాన రోడ్లు సీసీ, తారురోడ్డు వేయాల్సి ఉంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు కాలనీలో నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు ఏర్ప డ్డాయి. అయిన ప్పటికీ మున్సిపల్ అధికారులు సరైన చర్యలు చేపట్టా లేదు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున వర్షాలు కురిస్తే పరి స్థితి ఏమిటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే డ్రైనేజీ నిర్మిస్తాం



హౌసింగ్‌బోర్డులో త్వరలోనే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం.గతంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి అట్టి నిధు లు రాకపోవ డంతో డ్రైనేజీ, రోడ్డు నిర్మాణంలో జాప్యం జరిగింది. మున్సిపల్ నిధుల నుంచి డ్రైనేజీ,రోడ్డు వ్యవస్థను మెరుగుపరుస్తాం.

-వరలక్ష్మీ లింబాద్రిగౌడ్, కౌన్సిలర్

● గుంతలు పడ్డ రోడ్డు

బస్టాండ్ వైపు నుంచి హౌసింగ్‌బోర్డుకు వచ్చేదారిలో రోడ్లపై తారు లేచిపోయి గుంతలు పడి వాహన దారులకు ఇబ్బందిగా మారింది. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతో ఉంది. మున్సిపల్‌కు ఇంటి పన్నుల రూపంలో డబ్బులు చెల్లిస్తున్నప్పటికీ ప్రజలకు సరైన సౌకర్యాలు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించి రోడ్డు బాగు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే పోచారం గ్రూపుల పరంగా విమర్శలు చేస్తే సహించేది లేదు

● పార్టీ వెన్నంటి ఉన్న వారికే స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యత : బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు

వర్ని,జులై7: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తన స్థాయిని మరిచి కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయ తగాదాలు సృష్టించేలా విమర్శలకు దిగుతున్నారని వర్ని మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్ సమక్షంలో వారు వర్నిలో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి పోచారంను ఆహ్వానించిన పోచారం సీఎంను ఆహ్వానించిన పార్టీ విలువలకు కట్టుబడి ఉండకుండా పోచారం పార్టీకి నష్టం కలిగించేలా పత్రిక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీలో పదేళ్ల పాటు పలు కీలక పదవులు అనుభవించిన పోచారం మాజీ సీఎం కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కాసుల బాలరాజును స్కూటర్లు, మీటర్ల దొంగగా చిత్రీకరించి ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరి అదే బాలరాజును అక్కున చేర్చుకోవడం హాస్యస్పదమని విమర్శించారు. సంస్కార్ భూముల విషయంలోనూ తనపై నిరాధార ఆరోపణలు చేశారని ఈ విధానంతో ప్రజలు సైతం పోచారం వైఖరిపై నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పలు ఎన్నికల్లో పోచారం మూడో స్థానానికి దిగజారారని కాంగ్రెస్ పార్టీ మాత్రం డిపాజిట్‌లో మొదటి స్థానంలో ఉన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలని సవాల్ చేశారు. తన సహచరులకు కబ్జాలు చేయించిన ఘనత పోచారంది కాదా అని ప్రశ్నించారు.



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ఏఐసీసీ ఆదేశాలతో నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలోనే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు అన్ని ఎన్నికల్లో సముచిత గౌరవం లభిస్తోందని భరోసా ఇచ్చారు. ఇక నుంచి పోచారం శ్రీనివాస్ రెడ్డి తప్పుడు ఆరోపణలకు దిగితే తమ పార్టీ నాయకత్వం చూస్తూ ఊరుకునేది లేదన్నారు. పార్టీలు మారే నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు కులకర్ణి సురేష్, భజ్యా నాయక్, రెడ్డి రాంబాబు, గంగప్పా. దశరథ్, ప్రసాద్, రమేష్ రాథోడ్, వకీల్ ఫారం రాంబాబు, కోనేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా ?

● గోవూర్ శివారులో నిజామాబాద్-బాన్సువాడ రోడ్డులో తరచూ ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు ● ఇబ్బందుల్లో గ్రామస్థులు

మోస్రా,జూలై7: మండలంలోని గోవూర్ గ్రామ శివారులోని నిజామాబాద్ బాన్సువాడ రోడ్డుపై తరుచు రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా ఇక్కడి ప్రాంతం రోడ్డును ప్రమాద సంబంధిత ప్రాంతంగా రోడ్డు రవాణా శాఖ అధికారులు అధికారికంగా ప్రకటించి సంవత్సరాలు గడుస్తున్నా బారికేట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ఆయా శాఖల అధికారులకు మొరపెట్టిన ఇప్పటి వరకు పట్టించుకున్న నాధుడే లేడని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరుచు జరుగుతున్న ప్రమాదాల వల్ల ఇప్పటి వరకు ఏడుగురు మృతి చెందారని మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రేడియంతో కూడిన ప్రమాద హెచ్చరిక సూచికబోర్డు, రేడియంతో కూడిన బారికేట్లు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డితో పాటు గ్రామస్థులు, సహకార సంఘ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, గ్రామ పెద్దలు, గ్రామ యువకులు, ఆయా పార్టీల నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● ఓవర్ స్పీడ్ వల్లనే ప్రమాదాలు

రోడ్డు పరంగా ప్రాబ్లమ్ లేదు. ఓవర్ స్పీడ్ వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయి. బారికేడ్లు పోలీసుశాఖ, ఆర్‌టీఏ వాళ్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని అని అన్నారు. ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ కృష్ణ కుమార్ బారికేడ్లు ఇస్తామని ఆర్ అండ్ బీ ఏఈతో చెప్పినాము బారిగేట్లుకు గుద్దుకుని మళ్లీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నది. బారిగేట్లు ఇస్తాము కాని రాంబుల్ స్ట్రైక్స్ ఎక్కువగా వేయాలి అని ఆయన అన్నారు.



గోవూర్‌లో ప్రమాదాలు జరుగుతున్న స్థలం ఇదే..

బోధన్‌లో ఘనంగా బోనాల పండుగ



బోధన్‌లో బోనాల పండుగ దృశ్యం



నగరంలో బోనాలు ఎత్తుకున్న దృశ్యం

సుభాష్‌నగర్, జూలై 7: రైల్వే గూడ్స్ షెడ్డు హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని విగ్రహాన్ని ఊరేగింపుగా రైల్వే కమాన్ ప్రాంతంలో నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేటా రైల్వేగూడ్స్ షెడ్డు హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు బొబ్బిలి మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో దినేష్, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: ఆషాడ మాసం సందర్బంగా గోవూర్ గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ దేవతలకు డప్పు చప్పుళ్లతో ఆటపాటలతో బోనం సమర్పించి యాటలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించి కోరిన కోర్కేలు తీర్చాలని అమ్మవారిని కోరుకున్నారని గౌడ సంఘం సభ్యులు తెలిపారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలోని బస్వతారక్ నగర్‌లో పూసల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా మహలక్ష్మి ఆలయానికి చేరుకున్నారు. ఆషాద మాసం తొలి ఆదివారం కావడంతో బోనాల పండుగలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్బంగా అమ్మవారి ఆలయానికి చేరుకుని ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సకాలంలో కురువాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూసల సంఘం అధ్యక్షుడు పసులోటి గోపికిషన్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షుడు పరమేష్, కోశాధికారి గోవింద్ కుమార్. నరేష్, తిరుపతి, అశోక్, చిన్న నాగేశం తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ

ఆర్మూర్‌టౌన్ , జూలై7: ఆర్మూర్ పట్టణ శివారులో పెద్దమ్మ ఆలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయం తలుపులను పగులగొట్టి పెద్దమ్మతల్లి విగ్రహంపై గల సుమారు ఎనిమిది మసాల బంగారు ఆభరణాలు, ఐదు తులాల వెండి పట్టగొలుసులు దొంగలు ఎత్తుకెళ్ళారు. విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గత కొన్నేళ్లుగా ఆలయంలో గుర్తుతెలియని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



తలుపు పగుల గొట్టిన దృశ్యం

నేడు జక్రాన్‌పల్లికి ఎమ్మెల్యే రాక

జక్రాన్‌పల్లి, జూలై7: మండల కేంద్రంలోని జక్రాన్‌పల్లిలో సోమవారం కళ్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్మాయి తెలిపారు. జక్రాన్‌పల్లిలోనిఅరుంధతి పంక్షన్‌హాల్‌లో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూప తిరెడ్డి లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

ఆదర్శ పాఠశాల సందర్శన

మండలంలోని జక్రాన్‌పల్లిలో ఆదర్శ పాఠశాలను సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే సందర్శించనున్నారని ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

రెండో రోజు కొనసాగిన అంగన్‌వాడీల నిరసన



నగరంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పెద్దబజార్, జూలై 7: మాటతప్పితే పోరాటం తప్పదని న్యాయబద్ధంగా రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి స్వర్ణ అన్నారు. ఆదివారం రెండవ రోజు ధర్నాచౌక్ వద్ద అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు ధర్నా కొనసాగింది. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందని అందుకే పోరాట బాట పట్టాల్సి వచ్చిందన్నారు.అంగన్‌వాడి టీచర్స్, హెల్పర్స్‌కు అత్యంత తక్కువ డబ్బులు చెల్లించి జూలై 1 నుంచి ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క టీచర్లకు 2లక్షల రూపాయలు, హెల్పర్స్‌కు లక్ష రూపాయల రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని వాగ్దానం చేశారని ఇచ్చినమాట నిలబెట్టుకోకపోతే పోరాటం తప్పదని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా సర్క్యులర్ ఇచ్చి 65 సంవత్సరాలు నిండిన వారిని బలవంతంగా ఇంటికి పంపించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఈ సందర్బంగా ఆమె కోరారు. ఈకార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, రమేష్‌బాబు, సరస్వతి, రాజ్యలక్ష్మీ,హేమావతి, ఆయాలు, టీచర్లు పాల్గొన్నారు.

కన్నుల పండువగా జగన్నాథ రథయాత్ర



భీమ్‌గల్‌లో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

భీమ్‌గల్ రూరల్, జూలై 7: పూరిలో జరుగుతున్న జగన్నాధ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇస్కాన్ నిజామాబాద్ ద్వారకనగర్ వారి ఆధ్వర్యంలో జగన్నాధ రథయాత్ర కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం, ఇస్కాన్ నామమట్ట ప్రచార కేంద్రం భక్తులు కన్నుల పండువగా నిర్వహించారు. నూతనంగా తయారు చేయించిన పూరి రథంలో జగన్నాయకులను ఆశీలను చేసి బస్టాండ్ నుంచి అంగడిబజార్ మీదుగా వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకవచ్చారు.అనతంతరం హిందూమత సాంప్రదాయలను గురించి భక్తులకు వివరించారు.ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంగం సభ్యులు జవ్వాజి భూమయ్య, శ్రీనివాస్ జవ్వాజి, భూపాల్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో యువకుడి మృతదేహం లభ్యం

రుద్రూరు, జూలై 7: రుద్రూరు పెద్ద చెరువులో యువకుడి మృత దేహం లభ్యమైన సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రుద్రూరు గ్రామానికి చెందిన పి.నరేష్ అనే యువకుడు చెరువులో చేపల వేటకు వెళ్లగా వల చుట్టుకుని మృతి చెంది నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అప్పారావు ఘటన స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని వెలికి తీయిం చారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని బోధన్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన పి.నరేష్ మృత దేహం

వైభవంగా జగన్నాథ వార్షికోత్సవం



ధర్పల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

ధర్పల్లి, జూలై 7: మండల కేంద్రంలో జగన్నాథ ఆలయ వార్షికోత్సవం అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. గ్రామ శివారులోగల సిద్దుల గుట్టపై వెలసిన జగన్నాథుని వార్షికోత్సవం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతియేటా నిర్వహిస్తారు. వార్షికోత్సవం సందర్బంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. నిర్వహకులు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ అర్గుల్ రాజేశ్వర్‌రెడ్డి, లక్పతి, బొర్రన్న, రాము, నారాయణ, శ్రీనివాస్, సురేష్,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీమంజూనాథ ఆటో యూనియన్ కార్యవర్గ

కమ్మర్‌పల్లి, జూలై 7! కమ్మర్‌పల్లి లో శ్రీ మంజూనాథ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గత రెండు సంవత్సరాలు వరుసగా ఎన్నికైన బిట్ల అనీల్ ను మూడవసారి సైతం అధ్యక్షుడిగా సభ్యులు ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా బొడ్డురాము, కోశాధికారిగా పెండెం మినేష్, కార్యదర్శిగా సుందరి రవిందర్, సలహాదారురుడిగా అబ్దుల్ ఖాదర్, దాత్రిక రాజేందర్, పిల్లమారి సుధాకర్ లను సభ్యులు ఎకగ్రీవంగ ఎన్నుకున్నారు.

బాల్కొండలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బాల్కొండలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ముప్కాల్, జూలై7: బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1997-98విద్యసంవత్సరం పదోతరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 27ఏళ్ళ తర్వాత అందరు అప్యాయంగా పలకరించుకున్నారు.అనాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరినోకరు యోగ క్షేమాలు అడిగితెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడి ఒక్క చోట చేరిన స్నేహితులను కలుసుకోవడం ఆనందానికి అవదులు లేని క్షణాలు ఎప్పటికీ మరిచిపోలేని మధుర స్మృతులని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా తమకు పాఠాలు బోధించిన గురువులను పూర్వ విద్యార్థులు శాలువతో సన్మానించారు. అంతకు ముందు తొలి విద్యార్థుల మృతికి సంతాపం తెలిపారు.

యోగా సాధన వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు


జడ్పీ చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఖిల్లా, జూలై 7: యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మహర్షి యోగా కేంద్రం 17వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని సాయినగర్‌లో యోగా వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభాకర్ సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు వ్యాయామంతో పాటు యోగాశ్రమం తప్పకుండా చేయాలని అన్నారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని అన్నారు.ఈకార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పిట్లకృష్ణ మహారాజ్, బీసీఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్య క్షుడు వినోద్‌లను సంఘ సభ్యులు సన్మానించారు.

అగ్నివీర్‌లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూలై 7: భారత వాయుసేనా అగ్నివీర్ వాయులో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తుందని జిల్లాలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.జూలై 3, 2004 నుంచి 3 జనవరి 2008 మధ్య పుట్టిన వారై ఉండి ఇంటర్మీడియెట్, ఇంటర్మీడియెట్‌కు సమానమైన విద్యార్హత కలిగి వివాహం కాని యువతీ యువకులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ఆయన తెలిపారు. అర్హులైన వారు ఈనెల 8 నుంచి 28 వరకు అగ్నిపత్‌వాయు.సిడిఎసి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్, జూలై 7: ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశానికి టిజిఎప్‌సెట్-2024 మొదటి విడత కౌన్సిలింగ్ కొనసాగుతుంది. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల కౌన్సిలింగ్ కేంద్రంలో ఆదివారం 630 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించినట్లు జిల్లా సమన్వయ కర్త శ్రీరాంకుమార్ తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈనెల 13 వరకు కొనసాగుతుందని వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు ఈనెల 8 నుంచి 15తేదీలోగా వెబ్ ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

కన్నుల పండువగా ఆల్ఫోర్స్ ఆరంభ్



ఆరంభ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, జూలై 7: ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆల్ఫోర్స్ కల్చరల్ ఫీస్ట్ ఘనంగా జరిగింది. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతూ అనుకున్న లక్ష్యాలను చేరలేకపోతున్నారని తరగతి గదుల్లో ఉత్తమంగా వ్యవహరిస్తూ శ్రద్ధ, ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులు సంచలన విజయాలు నమోదు చేయడం గొప్ప విషయమన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిజామాబాద్ డిస్ట్రిక్ట్ డ్యాన్స్ అసోసియేషన్ వార్షిక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

నిజామాబాద్ అర్బన్, జూలై 7: నిజామాబాద్ డిస్ట్రిక్ట్ డాన్స్ అసోసియేషన్ వార్షిక సమావేశాన్ని నగరంలోని అంజలి సిస్టర్స్ డాన్స్ అకాడమినందు నిజామాబాద్ డిస్ట్రిక్ట్ డాన్స్ అసోసియేషన్ వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఆనంద్‌బాబు మాట్లాడుతూ అసోసియేషన్ ప్రారంభించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆగస్టు 20వ తేదీన జిల్లాస్థాయి కల్చరల్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇందులో జానపదం, శాస్త్రీయ నృత్యాలు, వెస్ట్రన్ డాన్స్ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ కార్యదర్శి తోట ప్రశాంత్, కోశాధికారి నవనీత, సలహాదారులు పసునూరి వినయ్‌కుమార్, మద్దుకూరి సాయిబాబు, సంయుక్త కార్యదర్శులు మృనాలిని, గీతాంజలి, అమృత్, రఘు, శ్రాకాంత్, సోను, చందు, అంజలి, అమృత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


బోధన్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం దృశ్యం


నగరంలో నినాదాలు చేస్తున్న దృశ్యం


నవీపేటలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జులై7: బోధన్ పట్టణంతో పాటు సాలూర మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ చౌరస్తాలో మాదిగ దండోరా జెండావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు తాడెపు అబ్బయ్య చేతుల మీదుగా జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ యొక్క 59వ జన్మదిన వేడుకలను కేక్‌కట్ చేసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ డల్లా సురేష్ మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధనకై ప్రతి ఒక్కరు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గంగాధర్, శంకర్, గంధమాల చంద్రయ్య, నర్సింలు, వినోద్ కుమార్,సాయిలు, భాస్కర్,మహిళ నాయకురాలు సావిత్రి, బాలమణి, చంటి, వెంకట్ పటేల్, స్వామి గౌడ్,సురేష్, సంజీవ్, రాజాగౌడ్,నజీర్, సుభాష్, లాలయ్య, లక్ష్మయ్య,నాగురావు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: జిల్లా వ్యాప్తంగా ఎంఆర్‌పిఎస్ 30 సంవత్సరాల పండుగను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బోర్గాం చౌరస్తా వద్ద ఎంఆర్‌పిఎస్ జెండాను ఎగరవేశారు. అనంతరం మందకృష్ణ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి జిల్లాల ఇంచార్జి నాగభూషణం మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భవించి 30 సంవత్సరాలు నేటితో పూర్తయిందని 30 సంవత్సరాలుగా ఎస్సీల వర్గీకరణ కోసం వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ నాయకత్వంలో పోరాటం చేస్తున్నామన్నారు. ఏ ప్రభుత్వం వచ్చిన వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేస్తామని చెప్పి మాటిచ్చి మోసం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ చేస్తామని మాట ఇవ్వడం జరిగిందని ఇప్పటి వరకు మాట నిలబెట్టుకోలేదన్నారు. బిజెపి ఇచ్చిన మాట ప్రకారం మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కరాజేందర్, కిష్టయ్య, శివ, దీపక్, మనోహర్, ప్రభాకర్, మహేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

● మాదిగ దండోరా ఆధ్వర్యంలో...

మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో వినాయక్‌నగర్ నుండి నాగారం, గాంధీచౌక్, అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్‌కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోశెట్టి, మహేష్, సంజీవ్, రాంచందర్, యాదగిరి, నవీన్, శేఖర్, యమున, సత్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ జూన్ 7 : మాదిగ రిజర్వేషన్ల వర్గీకరణ చేసే వరకు తమ ఉద్యమాన్ని ఆపేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం సిరికొండలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి సంజీవ్ పూలమాల వేశారు. జండాను ఎగుర వేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగా అధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలను నిర్వహించినట్లు చెప్పారు. రిజర్వేషన్ల వర్గీకరణ చేస్తామని అన్ని పార్టీలు హామీలు ఇస్తున్నాయే కాని ఏ ఒక్క పార్టీ ఆచరించడం లేదన్నారు. తాము మాత్రం వర్గీకరణ అయ్యేవరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని సంజీవ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మాజీ సర్పంచ్ చిట్యాల రవీశంకర్ బొర్రన్న,వెంకటేశ్,ఒడ్డెన్న,తూర్పు లింగం,రాములు,సాయన్న,శ్రీధర్,రాజేందర్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో ఎ మ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మహజన సోషలిస్టు పార్టీ కోఆర్డినేటర్ మానికోళ్ల గంగాధర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు జీవన్, చిరంజీవి, బాబు, సుదర్శన్, రాజు, వెంకట్, హేమలత, సాయమ్మ, సునీత, బోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

● కమలాపూర్‌లో..

మండలంలోని కమలాపూర్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆకారం రమేష్, మైలారం బాబు, లింగం, సుధాకర్, బాబు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మాదిగ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పులతో పాతబస్టాండ్ నుంచి కొత్తబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్‌చౌరస్తాలో మాదిగ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, తాజామాజీఎంపీపీ పస్క నర్సయ్య, గంగోని స్వామి, రింగుల భూషణ్, ఎల్‌టి.కుమార్, మైదం బాజన్న, ఆచేపల్లి దేవయ్య, మేదరి సాయన్న, మాజీసర్పంచ్‌లు టీసీ.సాయన్న, గణేష్, నర్సింలు, కలిగోట సాయి, అశోక్, మల్కన్న, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన సందర్భంగా యువకులు రక్తదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ మైలారం బాలు, మండల అధ్యక్షుడు నాగం శ్రీనివాస్, విప్లవ్, తదితరులు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో రక్తదానం చేస్తున్న ఎమ్మార్పీఎస్ యువకులు


ఆర్మూర్‌లో అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న మాదిగ సంఘాలు


సిరికొండలో..

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● అర్హులకే పథకాలు ● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి


ధర్పల్లి- బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ధర్పల్లి, జూలై 7: రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు రేకులపల్లి, సీతాయిపేట్, నడిమితాండా, ఒన్నాజిపేట్ గ్రామాలలో జరిగిన వివిధ అభివృద్ధి పనులకు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుబంధు పేరుతో రూ.24వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేసిందని ఆయన విమర్శించారు. రోడ్లకు, పెట్రోల్‌బంక్‌లకు, వ్యాపార సముదాయాలకు, ఉన్నత వర్గాలకు రైతుబంధును ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేసిందన్నారు. ఇందులో భాగంగానే రైతుబంధుపై రాష్ట్ర వ్యాప్తంగా రైతుల నుంచి సమాచారాలు సేకరించి అర్హులైన వారికే రైతుబంధు వర్తించే విధంగా చూస్తున్నామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆగస్టు 1 నుంచి రుణమాఫీ చేస్తామన్నారు. ప్రతి ఇంటిలో రూ.2లక్షల మేర రుణమాఫీ చేసేందుకు కసరత్తును రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఇన్‌కమ్ టాక్స్ కట్టే రైతులకు రుణమాఫీ వర్తించదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పథకాలను ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల్లో పార్టీలకు అతీతంగా నిరుపేదలైన వారికి వర్తింపజేస్తామని పైరవీలకు ఎలాంటి తావులేకుండా చూస్తామన్నారు. విడతల వారిగా మండలంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. కొందరికి టెక్నికల్ కారణంగా సిలిండర్ సబ్సిడి, విద్యుత్ సబ్సిడి అందడం లేదని ఈ విషయంపై అధికారులతో చర్చిస్తున్నామని అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు వర్తించే విధంగా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, గాదారి మనోహర్‌రెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, చెలిమెల నర్సయ్య, బేల్దారి కృష్ణ, మిట్టపల్లి ప్రవీణ్‌రెడ్డి, చెలిమెల శ్రీనివాస్, కమ్మరి గంగాధర్, వైజీఆర్, లాల్‌సింగ్, లొక్కిడి రాములు, భాస్కర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సుధాకర్, వాడి గంగారెడ్డి, ఆర్మూర్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఘనంగా బోనాల జాతరా


బోనాల ఊరేగింపులో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్, జూలై7:ఆషాఢం అమ్మవారికి సమర్పించే బోనాలలో తొలి బోనాల జాతరాను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఏట ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సమర్పించే బోనాన్ని భక్తిప్రవక్తులతో అందించారు. ప్రత్యేకంగా తయారు చేసిన బోనాలను పూజించి మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని ముదిరాజ్ సంఘం నుంచి ఊరెగింపు నిర్వహించారు. సంఘ సభ్యులు కుల పెద్దలు బోనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరెగింపును ప్రారంభించారు. సంఘం నుంచి బయలుదేరిన బోనాల ఊరేగింపుకు భక్తులు, మహిళలు దారిపొడుగున ఘనస్వాగతం పలికారు.ఊరేగింపులో డప్పులదరి పోతరాజుల విన్యాసాలు, శివశక్తుల విన్యాసాలతో మారుమోగాయి. సంఘం నుంచి బయలుదేరిన మహిళల బోనాల ఊరెగింపు వీకీ మార్కెట్, పోచమ్మగల్లీ, ఆలయం వరకు సాగింది. ఆలయం ఎదుట భక్తులు బోనాలకు మంగళల హారతులు ఇచ్చి నిరాజనాలు పలికారు.ఈసందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో అమ్మవారికి తొలిబోనాన్ని ముదిరాజ్ సంఘం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, వర్షాలు సమృద్ధిగా కురియాలని పాడిపంటలు,ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి బోనాన్ని సమర్పించామన్నారు.ఈకార్యక్రమంలో అధ్యక్షుడు మాదవ్, సుధాకర్, మల్లేష్, సత్యనారయణ, ఉపాధ్య క్షుడు రామకృష్ణ, లక్ష్మినారయణ, సంయుక్త కార్యదర్శులు ఈర్లశేఖర్, దేవిదాస్, మురళిధర్, కులపెద్దలు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో దరఖాస్తుల ఆహ్వానం

ముప్కాల్, జూలై7: శ్రీరాంసాగర్ మహిళ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌లో ఈనెల 13వ తేదీ సాయంత్రం 5గంటల వరకు రెండు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకో వాలని డీపీఎం మారుతి తెలిపారు. కాంట్రాక్ట్ సీఈవో మేనేజర్‌కు బీఎస్సీ అగ్రికల్చర్, అగ్రికల్చర్ మార్కెటింగ్, అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ బీబీఏ సమానమైన ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌లు, అలాగే ఇంటర్ డిప్లొమా అగ్రికల్చర్, అగ్రికల్చర్ బిజినెస్, మార్కెటింగ్ కోర్సులు పూర్తి చేసి ఉండాలని, నెలసరి వేతనం రూ.15వేలు ఉంటుంద న్నారు.అకౌంటెంట్ ఉద్యోగానికి బీకాం కంప్యూటర్,అకౌంటెంట్ అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఆసక్తిగల అభ్యర్థులు బాల్కొండ మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు.

రేపు టీయూలో జాబ్ మేళా

డిచ్‌పల్లి,జులై 7: తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్, రిజి స్ట్రార్ ఆదేశాల మేరకు పీజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యా ర్థులకు ఈ నెల 9న తెలంగాణ విశ్వవిద్యాలయం,తెలంగాణ ఆకా డమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంస్థ సంయుక్తంగా డీఎస్ టెక్నాల జీస్ కంపనీలో టెక్నికల్ రిక్రూటర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎక్స్ క్యుటీవ్ మార్కెటింగ్ ఖాళీల భర్తీకి డీఎస్ టెక్నాలజీస్ వారిచే ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నమని ఈ మేళాలలో ఉద్యోగ ఔత్సహి కులకు, వ్యక్తిగత పరిచయ రౌండ్, గ్రూప్ డిస్కర్షన్, ఎఫ్‌టూ ఎఫ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నమని ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డా.పాత నాగరాజు తెలిపారు. పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యా ర్థు లు ప్లేస్‌మెంట్ సెల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని డైరెక్టర్ పేర్కొన్నారు.

ఇందూరు తిరుమలను సందర్శించిన వైద్యులు


నర్సింగ్‌పల్లి ఆలయంలో వైద్యులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

మోపాల్, జూలై 7: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో ఉన్న ఇందూరు తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతీనెలా పిల్లలకు అమృత ప్రాసనం చేస్తున్న విషయాన్ని తెలుసుకునేందుకు ఆదివారం వైద్య అధికారులు సందర్శించి అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ ఆలయంలో పిల్లల మానసిక ఆరోగ్యం కోసం వేస్తున్న మందును స్వయంగా తెలుసుకునేందుకు హైదరాబాద్ నుంచి క్యాన్సర్‌కు సంబంధించిన వైద్యులు ఆలయాన్ని సందర్శించారు. డాక్టర్ చిన్నబాబు, ప్రసున్నరెడ్డిలతో పాటు పలువురు వైద్యులు ఆలయాన్ని సందర్శించి చిన్న పిల్లలకు వేస్తున్న మందు విషయాన్ని వారి తల్లిదండ్రులకు అడిగి తెలుసుకున్నారు. ఈ మందు వేయడం వల్ల పిల్లలు ఎలా ఉంటున్నారో, వారి ఆరోగ్య పరిస్థితి ఏంటి అని ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి ఇక్కడ ప్రతి నెలా మందు వేయిస్తున్నామని ఇప్పటి వరకు తమ పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటున్నారని వివరించారు. ఈ మందు వేయించడం పట్ల పిల్లలు మానసికంగా, ఆరోగ్యంగా దృఢంగా ఉంటున్నారని వివరించారు. ఈ మందు వల్ల తమ పిల్లలకు ఎలాంటి హాని జరగలేదన్నారు. ఈ మందు వేయించడం కోసం నిజామాబాద్ జిల్లా వాసులే కాకుండా ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ కోరుట్ల, మహారాష్ట్ర నుండి అనేక మంది తరలివస్తున్నారని తెలిపారు. ఇందూరు తిరుమల తిరుపతి దేవస్థానం వారు వేస్తున్న ఈ మందు వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటున్నారని డాక్టర్లకు వివరించారు. వైద్య బృందంతో పాటు ఆలయ వ్యవస్థాపకులు నర్సింహారెడ్డితో పాటు ఆలయ ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.265	రూ. 285

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73400	రూ.67,700	రూ.945

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కల్కి(3డి తెలుగు) (11.00, 2.45, 6.30, 10.15)
స్క్రీన్-2 : డిస్పికేబుల్ మి-4 (తెలుగు 3డి) (11.40, 2.00, 4.20, 6.40)
: డిస్పికేబుల్ మి-4 (ఇంగ్లీష్ 3డి) (9.00)
స్క్రీన్-3 : ఎంఎస్ ధోని (హిందీ) (11.30, 3.15, 7.00, 10.45)
స్క్రీన్-4 : కిల్ (హిందీ) (12.30, 3.00, 5.30, 8.00, 10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి(తెలుగు) (12.25, 3.50, 7.15)
స్క్రీన్-2 : కల్కి(తెలుగు) (10.30)
: కల్కి(3డి తెలుగు) (2.00, 5.30, 9.30)
స్క్రీన్-3 : కల్కి(3డి తెలుగు) (4.05, 7.20, 10.45)

దేవి : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కల్కి(హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్